ఎడిటర్ :
మంచె శరత్ చంద్ర
సంపుటి : 13
సంచిక : 314
పేజీలు : 5 వెల రూ. 2/-
శనివారం
21 మార్చి 2026
PUBLISHED FROM :
HYDERABAD

AM న్యూస్
ప్రతిదినం ప్రత్యేకం
www.amnews7.com

**ప్రేమాభిమానాల పరిమళం రంజాన్...**

ముస్లింలకు శుభాకాంక్షలు తెలియజేసిన కేసీఆర్




2 లో

# తొమ్మిది కొత్త పథకాలకు శ్రీకారం

- మొత్తంగా ఆ రంగానికి రూ. 1,45,591 కోట్ల కేటాయింపు
- ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా
- ప్రతి ఒక్కరి హెల్త్‌ప్రొఫైల్‌తో డిజిటల్ కార్డు
- ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు ఆరోగ్య భద్రత, ప్రమాద బీమా
- పేదల విద్యకు పెద్దపీట.. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు రూ. 5,000 కోట్లు
- గ్యారంటీ హామీల అమలుకు రూ.50,713 కోట్లు

2 లో



# మూసీపై ముందుకే.. రాజీ లేదు

భారాస, భాజపా ఒక్కటే
మొయినాబాద్ డ్రగ్స్ కేసుపై
భాజపా నేతలు ఎందుకు స్పందించరు?
ఫోన్ ట్యాపింగ్ కేసుకు..
హరీశ్‌రావుపై కొట్టేసిన కేసుకు సంబంధం లేదు
బడ్జెట్‌లో సంక్షేమం, అభివృద్ధికి సమప్రాధాన్యం
మీడియాతో ఇష్టాగోష్ఠిలో సీఎం రేవంత్‌రెడ్డి

2 లో



# షర్మిల పిల్లలకు జగన్ అన్యాయం

**వైఎస్ చనిపోయేనాటికి ఉన్న ఆస్తులన్నీ కుటుంబ ఆస్తులే**
**మనవలు నలుగురికీ సమానంగా పంచాలన్నది రాజశేఖరరెడ్డి ఆదేశం**
**షర్మిలకు ఇచ్చింది వాటా కాదు.. డివిడెండ్ మాత్రమే**
**ఆస్తుల పంపకం జరగలేదు**
**అసత్య ప్రచారాలొద్దు : వైఎస్ విజయమ్మ ప్రకటన**

హైదరాబాద్:
వైఎస్ రాజశేఖరరెడ్డి మరణించే నాటికి ఉన్న ఆస్తులన్నీ కుటుంబ ఆస్తులేనని.. ఇవన్నీ మనవలు, మనవరాళ్లు (కుమారుడు జగన్, కుమార్తె షర్మిల సంతానం) నలుగురికీ సమానంగా పంచాలన్నది ఆయన ఆశయం, ఆదేశం కూడా అని వైఎస్ సతీమణి విజయమ్మ ప్రకటించారు. షర్మిల పిల్లలకు జగన్ అన్యాయం చేశారని అన్నారు. మేనల్లుడు, మేనకోడలికి జగన్ ఎప్పటికైనా న్యాయం చేస్తాడని తల్లిగా ఆశిస్తున్నానని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఇళ్లు, రూ.230 కోట్ల నగదు, ఇతర ఆస్తులు ఇచ్చినా జగన్ కష్టార్జితంలో షర్మిల వాటా అడుగుతున్నారంటూ వైకాపా నేతలు పత్రికల్లో అసత్య ప్రచారాలు చేస్తున్న నేపథ్యంలో ఆస్తుల వ్యవహారంపై ప్రజలకు వాస్తవాలు తెలియజెప్పడానికి విజయమ్మ శుక్రవారం నోటరీ ద్వారా బహిరంగ ప్రకటన విడుదల చేశారు. 2009లో రాజశేఖరరెడ్డి మరణించేనాటికి ఉన్న ఆస్తులన్నీ కుటుంబ ఆస్తులేనని విజయమ్మ స్పష్టం చేశారు.

ఈ ఆస్తుల పంపకం ఎప్పుడూ జరగలేదన్నారు. ఉన్న ఆస్తులన్నింటినీ మనవలు, మనవరాళ్లు నలుగురికీ సమానంగా ఇవ్వాలన్నది వైఎస్సార్ ఉద్దేశం, ఆదేశం అన్నది సన్నిహితులందరికీ తెలిసిన వాస్తవమేనని పేర్కొన్నారు. సరస్వతి, యలహంక భూమి కూడా షర్మిలదే: అవగాహన ఒప్పందం (ఎంఓయూ)లో షర్మిలకు రాసిన ప్రతి ఆస్తీ న్యాయంగా ఆమెకు చెందాల్సినదేనని విజయమ్మ లేఖలో పేర్కొన్నారు. అందువల్లనే జగన్ ఎంఓయూ సిద్ధం చేశారని, వాస్తవానికి షర్మిలకు దక్కాల్సిన దానికంటే జగన్ తక్కువగానే ఇచ్చాడన్నారు. సరస్వతితో సహా ఎంఓయూలో లేని యలహంక భూమి కూడా షర్మిలదేనని వెల్లడించారు. ఇప్పటి వరకు షర్మిలకు ఇచ్చానని చెబుతున్న సొమ్ము ఆమె వాటాకు వచ్చిన డివిడెండ్ మాత్రమేనన్నారు.

వైఎస్సార్ మరణం వరకు ఆస్తుల పంపకం జరగలేదన్నారు. షర్మిలకు ఇచ్చినట్లుగానే జగన్‌కు కూడా ఆస్తులు ఇచ్చారని.. అది ఆస్తి పంపకం కాదని స్పష్టం చేశారు. నిజమేంటో నా దేవుడికి, నా కుమారుడికి తెలుసని విజయమ్మ పేర్కొన్నారు. గోబెల్స్ ప్రచారం చేయడానికి మీరెవరని ప్రశ్నించారు. మీరు ఎంత కాదన్నా దేవుడి న్యాయమే న్యాయం అని వ్యాఖ్యానించారు. అసత్య ప్రచారం మానుకోవాలని, మళ్లీ మళ్లీ మీడియాలో ప్రస్తావించవద్దని వైఎస్సార్ భార్యగా చేతులు జోడించి అడుగుతున్నానని పేర్కొన్నారు. ప్రకటనలో రాసినవన్నీ వాస్తవాలేనని దేవుడి సాక్షిగా విజయమ్మ వెల్లడించారు.

ఇదీ నేపథ్యం.. ఎంఓయూలో భాగంగా సరస్వతి పవర్ అండ్ ఇండస్ట్రీస్‌లో వైఎస్ జగన్, భారతి, క్లాసిక్ రియాల్టీలకు చెందిన వాటాలను విజయమ్మకు కేటాయించారు. క్లాసిక్ రియాల్టీ నుంచి కొన్న వాటాలతోపాటు జగన్, భారతిలు కేటాయించిన వాటాలను తన పేరుతో బదలాయించాలంటూ సరస్వతి బోర్డుకు గతంలో విజయమ్మ లేఖ రాశారు. ఆ మేరకు విజయమ్మ పేరుతో వాటాలను బదలాయిస్తూ సరస్వతి కంపెనీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ తీర్మానం చేసింది. దీంతో జగన్ యూ టర్న్



తీసుకున్నారు. చెల్లిపై ప్రేమతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నానని, ఇప్పుడు ఆ ప్రేమ లేనందున ఒప్పందాన్ని ఉపసంహరించుకుంటున్నానని జగన్ వెల్లడించారు. రాజకీయంగా తనతో విభేదించడమే దీనికి కారణమన్నది అందరికీ తెలిసిన వాస్తవమే. విజయమ్మ పేరుతో వాటాల బదలాయింపు చెల్లదంటూ తల్లిపై జగన్ ఏకంగా కోర్టుకెళ్లారు. ఓవైపు తల్లిపై ప్రేమ ఉందంటూనే ఆమెపై కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వివాదం చెన్నైలోని ఎన్‌సీఎల్ఏటీలో పెండింగ్‌లో ఉంది.

# ఏబీవీపీ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీలో బడ్జెట్ ప్రతుల దహనం..




ఏ ఎం న్యూస్ ఓయూ:
తెలంగాణ అసెంబ్లీ ప్రవేశ పెట్టిన బడ్జెట్ లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని ఏబీవీపీ ఆధ్వర్యంలో ఉస్మానియా యూని వర్సిటీ ఆర్ట్స్ కళాశాల వద్ద బడ్జెట్ ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి మాచెర్ల రాంబాబు మీడియా తో మాట్లాడుతూ అసెంబ్లీలో 2026-2027 ఆర్థిక సంవత్సరానికి గాను నేడు తెలంగాణ ఆర్థికశాఖ మంత్రి ప్రవేశ పెట్టిన బడ్జెట్ విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. రాష్ట్ర ఆర్థిక మంత్రి ప్రవేశ పెట్టిన 3,24,234 కోట్ల పద్దులో విద్యారంగానికి కేవలం 8 శాతం నిధులు కేటాయించి చేతులు దులుపుకుందన్నారు. మానవవనరుల రూపకల్పనలో కీలకభూమిక పోషించే విద్యారంగానికి పట్టుమని 10శాతం నిధులు కూడా కేటాయించకపోవడం సిగ్గుచేటు అన్నారు. బడ్జెట్ ప్రసంగంలో పేద విద్యార్థులు ఆధారపడి చదువుకునే ఫీజు రీయింబర్స్మెంట్ పథకం బకాయిల విడుదలపై కనీసం ప్రకటన కూడా చేయలేదంటే రీయింబర్స్ మెంట్ పథకం ఎత్తివేస్తారా అన్న అనుమానం కలుగుతుందన్నారు. ఉస్మానియా,చాకలి ఐలమ్మ యూనివర్సిటీలకు కేటాయింపులను స్వాగతిస్తున్నామని కానీ మిగతా గ్రామీణ ప్రాంతాల్లోని యూనివర్సిటీలకు కేటాయింపులు లేకపోవడం దారుణం అన్నారు.పరిశోధన నిలయాలైన యూని వర్సిటీలలో ఖాళీల భర్తీపై ప్రస్తావనే లేదంటే వాటిని నిర్వీర్యం చేయడమే అన్నారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే జాబ్ క్యాలెండర్ విడుదల చేసి 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పిందని కానీ ఈ ప్రసంగంలో జాబ్ క్యాలెండర్ ఊసే లేదని ఇది పూర్తిగా నిరుద్యోగులను వంచించడమే అన్నారు. ఈ బడ్జెట్ సమావేశాలు ముగిసేలోపే వెంటనే విద్యార్థులకు రావాల్సిన ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను విడుదల చేసి,యూనివర్సిటీలలో ఖాళీల భర్తీపై నిర్ణయం వెలువరించి,అన్నీ యూనివర్సిటీల అభి వృద్ధికి నిధులు కేటాయించి, జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ఉద్యో గాల నియామక ప్రక్రియ మొదలు పెట్టాలని డిమాండ్ చేశారు. లేకపోతే విద్యార్థి, నిరుద్యోగ సమాజం కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఉపేక్షించదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జాతీయ కార్య వర్గ సభ్యుడు జీవన్, హైదరాబాద్ సిటీ సెక్రెటరీ పృధ్వితేజ, స్టేట్ జాయింట్ సెక్రెటరీ అలివేలి రాజు, విద్య నగర్ విభాగ్ కన్వీనర్ హరిప్రసాద్, ఉస్మానియా యూనివర్సిటీ కార్యదర్శి మోక్షిత్, విజయ్ సింగ్, మోహన్ బాబు ,తన్మె, శివ, వంశి పాల్గొన్నారు.

# మూసీపై ముందుకే.. రాజీ లేదు

హైదరాబాద్:
"మొయినాబాద్ ఫాం హౌస్ డ్రగ్స్ కేసులో పోలీసులపై కాల్పులు జరిగినా.. భాజపా నేతలు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రామచందర్‌రావు ఎందుకు నోరు మెదపలేదు? అయిన దానికి, కాని దానికి స్పందించే భాజపా నాయకులు.. భారాస మాజీ ఎమ్మెల్యే ఫాంహౌస్‌లో ఇంత పెద్ద ఘటన జరిగినా ఎందుకు మాట్లాడలేకపోతున్నారు? ఆ రెండు పార్టీలు ఒకటేనని చెప్పడానికి ఇది నిదర్శనం కాదా?" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. "భారాస హయాంలో దాదాపు 6 వేల ఫోన్లను ట్యాపింగ్ చేసినట్లు ఆరోపణలున్నాయి. ఈ కేసు విచారణలో ప్రభాకర్‌రావు అందుబాటులో లేకపోవడంతో.. 20 నెలలు ఆలస్యమైంది. ఆయనిచ్చిన వివరణ ద్వారా బాధితులను పిలిపించి విచారిస్తున్నాం.
ఎవరినైనా బెదిరించారా? ఒత్తిడి చేశారా? ఆర్థికంగా లబ్ధి పొందారా? అన్నది విచారణలో తేలుతుంది. తర్వాతే కేసు ఫైల్ చేస్తారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో తనకు క్లీన్ చిట్ వచ్చిందని హరీశ్‌రావు చెబుతున్నారు. తన ఫోన్ ట్యాప్ చేసి.. వేధింపులకు పాల్పడ్డారని సిద్దిపేటకు చెందిన వ్యక్తి చేసిన ఫిర్యాదుపై పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. వేధించినట్లుగా హరీశ్‌రావుపై దర్యాప్తులో రుజువులు చూపలేకపోయారు. దీంతో సుప్రీంకోర్టు కేసు కొట్టేసింది. ఇదో ప్రైవేటు కేసు. దీనికి.. ప్రభుత్వం జరుపుతున్న ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధం ఏమిటి?" అని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. "ఈ-కార్ రేస్ కేసులో.. ఐఏఎస్‌పై చర్యలకు డీవోపీటీ అనుమతించడంతో సస్పెండ్ చేశాం. దాని విచారణా కొనసాగుతోంది. అలాంటపుడు నేనేమీ మాట్లాడను. మీకో.. నాకో.. వాళ్లను తొందరగా లోపలేయాలని ఉంటే.. అలా చేయడానికి వీల్లేదు. చట్టప్రకారం ముందుకెళ్లాల్సిందే" అని సీఎం స్పష్టం చేశారు. శాసనమండలి మీటింగ్ హాలులో శుక్రవారం నిర్వహించిన ఇష్టాగోష్ఠిలో మీడియాతో పలు అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడారు.

కొన్నాళ్లకు ఇంటర్ అంటే ఏమిటనే పరిస్థితి వస్తుంది

"బడ్జెట్‌లో అభివృద్ధికి, సంక్షేమానికి సమప్రాధాన్యమిస్తూ.. రాష్ట్ర భవిష్యత్ ఆర్థిక వృద్ధిని దృష్టిలో పెట్టుకుని మౌలిక వసతుల కల్పనకు సరిపడా నిధులు కేటాయించాం. దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో ప్రతి కుటుంబానికి ఇందిరా కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రవేశపెట్టాం. ఈ పథకం కింద రేషన్ కార్డు కలిగిన 1.15 కోట్ల కుటుంబాలకు రూ.5 లక్షల బీమా పరిహారం వర్తిస్తుంది. విద్యాకమిషన్ ఇచ్చిన నివేదికపై కేశవరావు కమిటీ అధ్యయనం చేస్తోంది. జాతీయ విద్యావిధానానికి అనుగుణంగా రాష్ట్రంలో మార్పులు తీసుకొస్తాం. దేశమంతా టెన్ ప్లస్ టూ విధానం అమల్లో ఉంది. మనం కూడా మారాలి. ప్రీ ప్రైమరీ నుంచి ప్లస్ టూ వరకు విద్యార్థులు ఒకే ప్రభుత్వ పాఠశాలలో చదివే విధానాన్ని అమలు చేయనున్నాం. కొన్నాళ్ల తర్వాత ఇంటర్మీడియట్ అంటే ఏమిటనే పరిస్థితి వస్తుంది.

నష్టపోయే వారికి న్యాయం ఎలా చేయాలన్నది ప్రశ్న

మూసీ పునరుజ్జీవం విషయంలో ముందుకే వెళ్తాం.. రాజీపడే ప్రసక్తే లేదు. ఈ ప్రాజెక్టు వల్ల నష్టపోయే వారికి ఎలా న్యాయం చేయాలన్నదే ప్రశ్న. వారిని తప్పకుండా ఆదుకుంటాం. మూసీ విషయంలో ప్రతిపక్షాల వాదన చిత్రంగా ఉంది. అభివృద్ధి చేయాలంటారు.. కానీ అడ్డుగా ఉన్నవేవీ తీయొద్దంటారు.. అదెలా సాధ్యం? రోడ్డు వెడల్పు చేయాల్సి వచ్చినప్పుడు.. రహదారిని ఆనుకుని ఉన్నవాటిని తొలగిస్తామా? లేదా..? ప్రతిపక్షాలది అర్థంలేని వాదన. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుకు సంబంధించి ఇప్పటికే 21 కి.మీ. డీపీఆర్ పూర్తయింది. మొత్తం 52 కి.మీ. డీపీఆర్ సిద్ధం కావాల్సి ఉంది. ఇది సాంకేతిక నిపుణుల ద్వారానే తయారవుతోంది. పూర్తి స్థాయిలో డీపీఆర్ వచ్చాక నిధుల కోసం కేంద్రానికి దరఖాస్తు చేస్తాం.

కేసీఆర్ మాటలు వింటే.. మేమూ బయటే కూర్చొంటాం

ప్రజలు ఎన్నుకోగా అధికారంలోకి వచ్చినవారు సేవకులుగా వ్యవహరించాలి. వారు కోరుకున్నవి చేయాలి. అలా అప్పగించిన పని చేయకపోవడంతోనే.. భారాసను ప్రజలు ఓడించి ఇంటివద్ద కూర్చోబెట్టారు. మేం పనిచేయకపోతే మాకూ అదే పరిస్థితి ఎదురవుతుంది. ఏ గ్యారంటీ ఎప్పుడు అమలు చేయాలో మాకు తెలుసు. కేసీఆర్ మాటలు వింటే.. మేం కూడా బయటే కూర్చుంటాం. వాస్తవాలను ప్రజల ముందుంచుతాం. ఎంత అప్పు ఉంది? ఎంత ఆదాయం వస్తోందో వివరిస్తాం.

బురద చల్లడం వారికి అలవాటు

టీడీఆర్, హిల్ట్ పాలసీలపై ఏ ఏజెన్సీతో విచారణకు ఆదేశించాలని కేటీఆర్, హరీశ్‌రావు కోరినా.. వెంటనే విచారణకు ఆదేశిస్తానని అసెంబ్లీలోనే ప్రకటించా. అడగడం, బురద చల్లడం, పక్కకు తప్పుకోవడం వారికి అలవాటుగా మారింది. హిల్ట్ పాలసీలో మొత్తం లేఅవుట్‌లు కలిపి సుమారు 9 వేల ఎకరాలు. ఇందులో పనికివచ్చేది 4 వేల ఎకరాలు. ఆ భూములు ఇప్పటికే పరిశ్రమల కోసం కొనుగోలు చేసినవి. అందులో పారిశ్రామిక అవసరాలకు కాకుండా.. మల్టీపర్పస్ అవసరాల కోసం వినియోగించుకునేలా మార్పు చేశాం. వారు కోరితే.. జూన్ 2 2014 నుంచి ఇప్పటివరకూ భూముల లావాదేవీలపై విచారణ జరిపిస్తా.

కేంద్రాన్ని నిధులు అడగడానికి నామోషీ ఎందుకు?

మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు చేసిన అప్పు రూ.3.47 లక్షల కోట్లకు పైగా ఉంది. ఇందులో గత ప్రభుత్వం చేసిన రుణాల కింద రూ.3.30 లక్షల కోట్లు.. అసలు, వడ్డీ కింద చెల్లించాం. రూ.2 లక్షల కోట్ల రుణాలను క్రమబద్ధీకరించి.. తక్కువ వడ్డీ కింద మార్చాల్సి ఉంది. ఆర్థిక వెసులుబాటును చూసుకుంటూ.. గ్యారంటీలు అమలు చేస్తూ వస్తున్నాం. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి చుక్కనీరు రానప్పటికీ.. దానికోసం తెచ్చిన అప్పు కింద ఇప్పటివరకు రూ.44 వేల కోట్లు చెల్లించాల్సి వచ్చింది. కేంద్రం వద్దకు ఒకటికి పదిసార్లు తిరిగి.. రాష్ట్రానికి రావాల్సిన నిధులు తెచ్చుకుంటున్నాం. కేంద్రం నుంచి వచ్చే సొమ్ములను ముందుగా తీసుకోవాలి. ఇంకా కావాలంటే వాటికోసం మళ్లీ అడగాలి. కేంద్రాన్ని అడగడానికి నామోషీ ఎందుకు? అలా చేయకపోతే ప్రజలకు అన్యాయం చేసినట్టే కదా?

భూముల అమ్మకాలకు వ్యతిరేకం కాదు


భూముల అమ్మకానికి కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ వ్యతిరేకం కాదు. అయితే ఆ నిధులను రాష్ట్ర ప్రయోజనాల కోసం పెట్టుబడి పెట్టాలనేది మాత్రమే మాడిమాండ్. ఫ్యూచర్ సిటీలో త్వరలోనే పరిపాలన కార్యాలయాన్ని ప్రారంభించనున్నాం. కాంగ్రెస్ పార్టీలో ఎవరైనా.. ఏ పదవినైనా ఆశించవచ్చు. ఆశించిన వారిని అడ్డుకోవడం, అభ్యంతరపెట్టడం జరగదు. సీఎల్పీ సమావేశంలో ఎమ్మెల్యేల అభిప్రాయం మేరకే పార్టీ అధిష్ఠానం ముఖ్యమంత్రిని ఎంపిక చేస్తుంది. జీవన్‌రెడ్డి విషయం పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, పార్టీ రాష్ట్ర ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌లను అడగండి. ఆపరేషన్ కగార్ కేంద్రం తీసుకున్న నిర్ణయం. మావోయిస్టులు జనజీవన స్రవంతిలోకి రావాలి. వారికి భద్రత కల్పిస్తామని నేను గతంలోనే విజ్ఞప్తి చేశా. ఎమ్మెల్సీల కేసులో గవర్నర్‌ను సంప్రదించాలని సుప్రీంకోర్టు చెప్పింది. అజారుద్దీన్ మంత్రిగా ప్రమాణం చేసి ఆర్నెల్లు కావడానికి ఇంకా సమయం ఉంది. ఆలోగా గవర్నర్‌ను కలిసి.. పరిస్థితి వివరిస్తాం. అప్పుడు సానుకూల నిర్ణయం రాకపోతే.. హైకోర్టుకు వెళ్లమని సుప్రీంకోర్టు చెప్పింది" అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# తొమ్మిది కొత్త పథకాలకు శ్రీకారం

హైదరాబాద్:
సంక్షేమం, అభివృద్ధి పథకాల జోడు గుర్రాల సవారీకి కొత్త బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసింది. నూతనంగా... తొమ్మిది సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టింది. ఇంతకాలం సంక్షేమం అంటే పేదలకే అనే భావన ఉండగా.. రాష్ట్ర ప్రజలందరి ఆరోగ్యసేవలకు, జీవన భద్రతకు కట్టుబడి ఉన్నట్లు బడ్జెట్‌లో ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇందులో భాగంగానే తొలిసారి రాష్ట్ర జనాభా మొత్తానికి వర్తింపజేసే కొత్త పథకాన్ని ప్రకటించింది. పేద, ధనిక అనే తేడా లేకుండా జనాభా మొత్తానికి వర్తించే సంక్షేమ పథకం ఇటీవలి కాలంలో అమల్లోకి రావడం ఇదే ప్రథమం. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల ప్రమాద జీవిత బీమా కల్పించే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని బడ్జెట్‌లో ప్రకటించడం ద్వారా అందరికీ ఇచ్చిన ప్రాధాన్యాన్ని చెప్పకనే చెప్పింది. చేయూత పథకానికి అర్హులైన వారికి 2 లక్షల నూతన పెన్షన్లను మంజూరు చేస్తామని వెల్లడించింది. కొత్తగా ప్రారంభించిన అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సంస్థ(ఏటీసీ)ల్లో చేరేవారికి నెలకు రూ.రెండువేల ఉపకార వేతనం ఇవ్వాలనే మరో కీలక పథకాన్ని ప్రకటించింది. దీనిద్వారా ఏటీసీల్లో ఎక్కువ మంది చేరేలా ఆకర్షించాలనేది ప్రభుత్వ లక్ష్యం. ఈ సంస్థల్లో చేరినవారు... వృత్తి నైపుణ్యాలు సాధిస్తే వారికి ఉద్యోగాలు రావడం లేదా స్వయం ఉపాధి సంస్థల ఏర్పాటుతో జీవనోపాధికి అవసరమైన మార్గం కల్పించాలని ఈ కొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. ఎంపిక చేసిన ప్రస్తుత ప్రభుత్వ పాఠశాలలను అన్ని వనరులతో కూడిన తెలంగాణ పబ్లిక్ స్కూళ్లుగా మార్పు చేయనున్నట్లు తెలిపింది. వాటిల్లో ప్రీ ప్రైమరీ నుంచి 12వ తరగతి వరకు విద్య అందుతుందని వివరించింది. ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు నూతనంగా బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రారంభిస్తామని వివరించింది. ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రకటించింది. ప్రభుత్వ ఉద్యోగులు.. పెన్షనర్లు, వారి కుటుంబాలకు వైద్యసేవలను అందించే ప్రత్యేక పథకాన్ని అమలు చేస్తామని పేర్కొంది. ఉద్యోగులు.. పెన్షనర్లకు ప్రమాద బీమా పథకం అమలు చేస్తామని తెలిపింది. రాష్ట్ర యువతకు వివిధ రంగాలలో తగిన నైపుణ్య శిక్షణ అందించడానికి.. వారికి ఉపాధి లభించిన దేశాల భాషను నేర్పించడానికి ఉద్దేశించిన సీఎం ఓవర్సీస్ ఎంప్లాయిమెంట్ ప్రోగ్రామ్‌ను ప్రకటించింది. అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యను అందించాలనే లక్ష్యంతో ఏర్పాటుచేస్తున్న యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూళ్లకు ఏకంగా రూ. 5 వేల కోట్లు కేటాయించింది. పేదలకు నాణ్యమైన విద్యను అందించడం ద్వారా వారి జీవితాల్లో అక్షర వెలుగులు నింపాలని సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా తానే మంత్రిగా ఉన్న విద్యారంగానికి బడ్జెట్‌లో అత్యంత ప్రాధాన్యమిచ్చారు.

మారుమూల పల్లెలు మొదలుకుని రాజధాని వరకు...

రాష్ట్రవ్యాప్తంగా రవాణా సదుపాయాలను మెరుగుపరచాలని రోడ్ల నిర్మాణం, మరమ్మతులకు భారీగా నిధులు కేటాయించింది. మూసీ కాలుష్యం నుంచి రాజధానివాసులకు విముక్తి కల్పించాలనే సంకల్పంతో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం 'మూసీ రివర్‌ఫ్రంట్ పథకానికి' నిధులు కేటాయించింది. మెట్రో విస్తరణ రెండో దశ పనులకు బడ్జెట్‌లో తొలిసారి నిధుల కేటాయింపుతో నగర రవాణా వ్యవస్థ మెరుగుకు భరోసా దక్కింది. రాష్ట్ర ప్రజలందరికీ హెల్త్ ప్రొఫైల్‌తో డిజిటల్ హెల్త్ కార్డులను అందజేయాలని సర్కారు సంకల్పించింది.



సంక్షేమ పథకాలకు 44.90 శాతం

గత బడ్జెట్‌లో అన్ని రకాల సంక్షేమ పథకాలకు కలిపి రూ.1.04 లక్షల కోట్లు కేటాయిస్తే వచ్చే ఏడాదికి ఈ పద్దు కింద రూ.1,45,591 కోట్లను ప్రతిపాదించింది. మొత్తం బడ్జెట్ వ్యయంలో సంక్షేమ పథకాలకు కేటాయింపులు 44.90% కాగా.. గత బడ్జెట్‌లో ఇది 34.21 %. దీనిని 10%పైగా పెంచడం ద్వారా సంక్షేమ పథమే తమ ధ్యేయమని రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో స్పష్టం చేసింది. మొత్తం 69 రకాల సంక్షేమ పథకాలను వివిధ శాఖల్లో అమలుచేస్తున్నారు.

మూలధన వ్యయం పెంపుతో అభివృద్ధికి ప్రాధాన్యం

మూలధన వ్యయ పద్దును ప్రభుత్వం రూ.36,504 కోట్ల నుంచి రూ.47,267 కోట్లకు భారీగా పెంచింది. ఏకంగా 29.40 శాతం పెంపును బడ్జెట్‌లో ప్రతిపాదించడం రాష్ట్ర అభివృద్ధికి ఉపకరిస్తుందని అంచనా. మొత్తం 28 ప్రభుత్వ శాఖల పరిధిలో చేపట్టే అభివృద్ధి పనులకు వీటిని ఖర్చుచేయాలని ప్రతిపాదించారు. గ్యారంటీ హామీలకు సంబంధించిన సంక్షేమ పథకాలకు వచ్చే ఏడాదికి రూ.50,713 కోట్ల కేటాయించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26) కోసం గత బడ్జెట్‌లో వేసిన రూ.3.04 లక్షల కోట్ల అంచనాలకన్నా ఆదాయం రూ.23,626 కోట్లు తగ్గింది. దీనిప్రకారం సవరించిన అంచనాలతో ఈ ఏడాది బడ్జెట్ ఆదాయం రూ.2.81 లక్షల కోట్లకు తగ్గిపోయింది. అయినా ప్రభుత్వం మరిన్ని భారీ ఆదాయ లక్ష్యాలతో.. సుమారు రూ.43 వేల కోట్లు పెంచి రూ.3.24 లక్షల కోట్ల కొత్త బడ్జెట్‌ను రూపొందించింది. ఆదాయం పెరుగుతుందన్న నమ్మకంతోనే అంతే మొత్తం ఖర్చుచేస్తామని కొత్త బడ్జెట్‌లో ప్రభుత్వం స్పష్టం చేసింది.

ఆదాయం... ఎందులో ఎంత పెరుగుతుందంటే...

గత బడ్జెట్ అంచనాలకన్నా అదనంగా పెంచిన రూ.43 వేల కోట్ల బడ్జెట్ ఆదాయ అంచనాలలో ఏ పద్దు కింద ఎంత పెరుగుతుందనేది రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. పన్నులద్వారా రూ.14 వేల కోట్లు, కేంద్రం నుంచి వచ్చే గ్రాంట్లలో రూ.13 వేల కోట్లు, పన్నేతర ఆదాయం రూ.6,412 కోట్లు, కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటా కింద రూ.3,710 కోట్లు, కొత్త రుణాలు రూ.5,325 కోట్లు అదనంగా వస్తాయని ప్రభుత్వం వివరించింది. ఈ అంచనాల ప్రకారమే పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు పెంచింది. కానీ ఆదాయం అదనంగా పెరుగుతుందని పెట్టుకున్న లక్ష్యాల్లో అన్నీ నెరవేరతాయా అనేది ఇప్పుడే చెప్పలేని పరిస్థితి. ఉదాహరణకు కేంద్రం నుంచి వచ్చే గ్రాంట్లు వచ్చే ఏడాది అదనంగా రూ.13 వేల కోట్లు పెరుగుతాయని తెలిపింది. కానీ గత కొన్నేళ్లుగా ఈ పద్దు కింద కేంద్రం నుంచి బడ్జెట్‌లో పెట్టుకున్న అంచనా ప్రకారం నిధులు రాలేదు. కేంద్ర గ్రాంట్లుగా రూ.22,782.50 కోట్లు వస్తాయని గత బడ్జెట్‌లో అంచనా వేస్తే రూ.11,161 కోట్లే వచ్చినట్లు సవరణ పద్దు వివరించింది.

కొత్త రుణాలే కీలకం...

రాష్ట్ర ప్రభుత్వానికి వస్తున్న మొత్తం ఆదాయం ఉద్యోగుల జీతభత్యాలు, రిటైర్డ్ ఉద్యోగులకు పింఛన్లు, పాత బాకీలపై వడ్డీలు, అసలు సొమ్ము కిస్తీల చెల్లింపులు, రెవెన్యూ ఖర్చులతో పోతున్నందున సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు కొత్తగా తీసుకునే రుణాలే కీలకంగా మారాయి. ప్రస్తుత ఏడాదిలో బహిరంగ మార్కెట్ నుంచి రూ.64,539 కోట్ల కొత్త రుణాలు తీసుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నా రూ.67,539 కోట్లను సేకరించారు. ఇక వచ్చే ఏడాదికి బహిరంగ మార్కెట్ నుంచి రూ.73,383 కోట్లు, ఇతర మార్గాల్లో మరికొన్నికలిపి మొత్తం రూ.82,870 కోట్ల కొత్త రుణాలను సేకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. వీటితో కలిపితేనే మొత్తం బడ్జెట్ ఆదాయం రూ.3.24 లక్షల కోట్లవుతుంది. కొత్త రుణాలను తీసుకోకపోతే అన్ని మార్గాల్లో వచ్చే ఆదాయం రూ.2.41 లక్షల కోట్లేనని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది.

జీఎస్‌డీపీ పెరుగుదలతో కొత్త ఆశలు..

ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలతో ఆర్థిక అస్థిరత నెలకొన్నా రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తి(జీఎస్‌డీపీ) వృద్ధిరేటు గతేడాది 10.6 శాతముంటే ఈ ఏడాది 10.7 శాతానికి పెరగడం ఆశాజనకంగా భావిస్తున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. జాతీయ సగటు వృద్ధిరేటు 9.8 నుంచి 8 శాతానికి పడిపోయినా రాష్ట్రానికి 10.7 శాతానికి పెరగడం ప్రభుత్వానికి ఊరటనిస్తోంది. జీఎస్‌డీపీ విలువ రూ.17.82 లక్షల కోట్లకు చేరింది. కొత్త రుణాల సేకరణకు జీఎస్‌డీపీ విలువ పెరుగుదల అత్యంత కీలకం. దీని ఆధారంగానే ఎఫ్‌ఆర్‌బీఎం పరిమితిలో తీసుకునే కొత్త రుణాలు ఈ ఏడాది సేకరించిన రూ.77,545.92 కోట్లకన్నా వచ్చే ఏడాది మరో రూ.5,325 కోట్లు అదనంగా వస్తాయని ప్రభుత్వం వివరించింది.

# ఓయూకు 1000 కోట్లు కేటాయింపు

**- సీఎం రేవంత్ రెడ్డి మరియు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి**

ఏ ఎం న్యూస్, ఓయూ:



ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల వద్ద ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశంలో ఉస్మానియా యూనివర్సిటీకి 1000 కోట్లు, చాకలి వీరనారి ఐలమ్మ యూనివర్సిటీకి 400 కోట్లు కేటాయించిన నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కొత్తపల్లి తిరుపతి మాట్లాడుతూ, విద్యా రంగానికి రాష్ట్ర ప్రభుత్వం 26,674 కోట్లు కేటాయించడం ఎంతో హర్షణీయమని పేర్కొన్నారు. ముఖ్యంగా గత డిసెంబర్‌లో ఓయూ ఆర్ట్స్ కళాశాల వద్ద నిర్వహించిన సభలో సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఉస్మానియా యూనివర్సిటీకి 1000 కోట్లు కేటాయించడం విద్యార్థులు, అధ్యాపకుల ఆశలను నెరవేర్చిన నిర్ణయమని అభిప్రాయపడ్డారు. ఈ నిర్ణయం రాష్ట్ర ఉన్నత విద్యాభివృద్ధికి కీలకంగా మారుతుందని, విశ్వవిద్యాలయ మౌలిక వసతుల అభివృద్ధి, పరిశోధనలకు ఇది తోడ్పడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఓయూ జేఏసీ నాయకులు చందు, రాజేందర్, రాజు, ప్రవీణ్, చరణ్, అరుణ్, స్వామి, శ్రీనివాస్, రమేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ బడ్జెట్‌లో విద్యకు కేవలం 8.2 శాతం కేటాయింపు సిగ్గుచేటు : ఏబీవీపీ జీవన్

ఏ ఎం న్యూస్ ఓయూ:




తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం 8.2 శాతం నిధులు కేటాయించడం సిగ్గుచేటని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) జాతీయ కార్యవర్గ సభ్యులు జీవన్ తీవ్రంగా విమర్శించారు. విద్యారంగం అభివృద్ధికి ఇది చాలా తక్కువ కేటాయింపు అని ఆయన పేర్కొన్నారు. విద్యారంగానికి కనీసం 15 శాతం నిధులు కేటాయించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశంలోని ఈశాన్య రాష్ట్రాలు అయిన నాగాలాండ్, త్రిపుర రాష్ట్రాలు విద్యకు పెద్దపీట వేస్తూ తమ రాష్ట్ర బడ్జెట్‌లో సుమారు 20 శాతం వరకు నిధులు కేటాయిస్తుండగా ప్రజా ప్రభుత్వం, విద్యార్థి ప్రభుత్వం అని ప్రగల్బాలు పలికే తెలంగాణ ప్రభుత్వం విద్యారంగానికి తగిన ప్రాధాన్యత ఇవ్వకపోవడం ఆందోళన కలిగించే విషయమని జీవన్ పేర్కొన్నారు. రాష్ట్ర భవిష్యత్తు విద్యపై ఆధారపడి ఉంటుందని, విద్యారంగాన్ని బలోపేతం చేయడానికి తగిన నిధులు కేటాయించడం అత్యవసరమని ఆయన తెలిపారు. విద్యార్థుల అభ్యున్నతి, విద్యా ప్రమాణాల మెరుగుదల కోసం ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని, విద్యారంగానికి 15% బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు.

## ప్రొటెస్టెంట్ నాయకుడు సాల్మన్ రాజ్కు నామినేటెడ్ పదవి ఇవ్వాలి

**-సికింద్రాబాద్ క్రైస్తవ నాయకులు**

ఏ ఎం న్యూస్ ఓయూ:



తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గోనె సాల్మన్ రాజ్కు ఏదైనా నామినేటెడ్ పదవి ఇవ్వాలనీ సికింద్రాబాద్ నియోజక వర్గం ప్రొటెస్టెంట్ చర్చి పాస్టర్లు, క్రైస్తవ సంఘాల నాయకులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం తార్నాకలో వారు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రముఖ ప్రొటెస్టెంట్ నాయకుడిగా ఎన్నో సంవత్సరాలుగా క్రైస్తవుల హక్కుల పరిరక్షణ కోసం సాల్మన్ రాజ్ సేవలందిస్తున్నారనీ పేర్కొన్నారు. కావునా సీఎం రేవంత్రెడ్డి స్పందించి ప్రొటెస్టెంట్ క్రైస్తవులకు ప్రభుత్వంలో సముచితమైన ప్రాధాన్యత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వి. జోషప్ పాల్, జాకబ్, ప్రశాంత్, జీవన్, పీఏ. మోజెస్, కరుణాకర్, సికింద్రాబాద్ క్రైస్తవ నాయకులు తదితరులున్నారు.

## మహిళ అదృశ్యం..

ఏ ఎం న్యూస్ ఓయూ:



ఓ మహిళ అదృశ్యమైన సంఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీసు స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తార్నాక స్ట్రీట్ నెంబర్ 10కి చెందిన నందిని(25) అవివాహిత. ఈ నెల 19న ఇంట్లో నుంచి చెప్పాపెట్టకుండా వెళ్లిపోయింది. ఇప్పటికీ తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రేమాభిమానాల పరిమళం రంజాన్...

హైదరాబాద్, మార్చి 20 :





రంజాన్ మాసం ఆఖరి పర్వదినమైన 'ఈద్ ఉల్ ఫితర్' సందర్భంగా బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్‌రావు ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతిరోజూ ప్రత్యేక దైవ ప్రార్థనలు, ఉపవాస దీక్షలు, భక్తి శ్రద్ధలతో ముస్లింలు పవిత్ర రంజాన్ మాసాన్ని ఆచరిస్తారని, ఈ సందర్భంగా పరస్పర శాంతి, సహనం, సౌభ్రాతృత్వం, ప్రేమాభిమానాలు పరిమళిస్తాయని పేర్కొన్నారు. లౌకికవాద విలువలకు ప్రాధాన్యమిస్తూ, విభిన్న మతాల సంస్కృతీ సంప్రదాయాలు, ఆచారాలను గౌరవిస్తూ, గంగా జమునా తహజీబ్‌కు ప్రతీకగా బీఆర్ఎస్ పాలన కొనసాగిందని తెలిపారు. రాష్ట్రంలో ముస్లిం మైనారిటీల సంక్షేమం, ప్రగతి కోసం విద్య తదితర రంగాల్లో అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు వారి జీవన విధానంలో గుణాత్మక మార్పునకు దోహదం చేశాయని వివరించారు. ప్రగతి తిరిగి పుంజుకుని, రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో జీవించాలని కేసీఆర్ ఆకాంక్షించారు.

### ఘనంగా మల్కాజ్గిరి పార్లమెంటు సభ్యులు


# ఈటెల రాజేందర్ పుట్టినరోజు వేడుకలు...

### బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో శుభాకాంక్షలు వెలువ...

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :



మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ జన్మదిన వేడుకలు వారి కార్యాలయం వద్ద శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, కూకట్పల్లి నియోజకవర్గ నాయకులు కార్యకర్తలతో కలిసి ఈటెల రాజేందర్ ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి మాట్లాడుతూ నిరంతరం ప్రజల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో కృషి చేసే నాయకుడు ఈటెల రాజేందర్ అని బడుగు, బలహీన వర్గాల కోసం నిరంతరం పోరాడుతూ వారి ఆశలకి దీపస్తంభంలా నిలుస్తున్నారనీ కొనియాడారు. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశ అభివృద్ధికి, ప్రజాసేవకు అంకితభావంతో పనిచేస్తూ భారతదేశ ప్రగతికి తన వంతు పాత్రను సమర్థంగా నిర్వర్తిస్తున్నారు అన్నారు.ఆయన సేవా భావం, నాయకత్వం యువతకు స్ఫూర్తి దాయకమని,ఆయనకు ఆరోగ్యం, ఆయురారోగ్యాలు కలగాలని, భవిష్యత్తులో ఇంకా ఉన్నత స్థానాలను అధిరోహించాలని కోరుకుంటున్నానని వడ్డేపల్లి తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కంచి మహేందర్ యాదవ్, ప్రీతం రెడ్డి, శ్రీనివాస్ గౌడ్ , మల్లేష్,వరలక్ష్మి, సులోచన, నియోజకవర్గంలోని సీనియర్ బిజెపి నాయకులు యువ మోర్చా నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా టిసిఎస్ఓ ఎం శ్రీనివాసరెడ్డి పుట్టినరోజు వేడుకలు

### శుభాకాంక్షలు తెలిపిన రేషన్ డీలర్స్ అసోసియేషన్ సభ్యులు...

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :



పౌర సరఫరాల విభాగం డి సి ఎస్ ఓ ఎం శ్రీనివాసరెడ్డి పుట్టినరోజు వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకొని మేడ్చల్ జిల్లా రేషన్ డీలర్స్ అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి వారితో కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా రేషన్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు అముర ఇంద్రసేన గుప్తా, సలహాదారులు మర్యాద అశోక్, నాగిళ్ళ శ్రీనివాస్, ఉప్పల రమేష్ గుప్తా, శ్రీనివాస్గౌడ్ పాల్గొన్నారు.

## బడుగు బలైన వర్గాల కోసం పోరాడుతున్న ఈటెల..

ఘనంగా ఈటల రాజేందర్ జన్మదిన వేడుకలు

బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి..

ఏ ఎం న్యూస్ ఓయూ:



గత 25 సంవత్సరాలుగా బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం ఈటెల రాజేందర్ నిరంతరం కృషి చేస్తున్నారని బిసి కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి అన్నారు. బడుగులకు విద్య ఉద్యోగ ఉపాధి రాజకీయ ఆర్థిక రంగాల్లో రాణించేందుకు తను చేస్తున్న పోరాటం మరువలేనిదని కొనియాడారు. ఎంపీ ఈటెల రాజేందర్ జన్మదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం షామీర్పేట్ లోని ఎంపీ నివాసంలో వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ అనంతోజు బ్రహ్మచారి, నరసింహ చారి, తాటికొండ శ్రీనివాస్ చారి, నరసింహ చారి, సాయి, సురేష్, రాజ్యలక్ష్మి, ఉపేందర్ రెడ్డి, శర్మలతో గణేష్ చారి వెళ్లి ఈటెల రాజేందర్ ను శాలువతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు చెప్పి కేక్ కట్ చేయించారు. అనంతరం గణేష్ చారి మాట్లాడుతూ ఈటెల రాజేందర్ ఆర్థిక శాఖ మంత్రిగా ఉన్నప్పుడు హాస్టల్ విద్యార్థులకు సన్న బియ్యంతో అన్నం పెట్టించాడని గుర్తించారు. కరోనా సమయంలో మనుషులు కానరాకున్నా హాస్పిటల్లో చుట్టూ తిరుగుతూ కరోనా బారిన పడిన రోగులు అధైర్య పడకుండా తాను ఉన్నానంటూ భరోసా కల్పించి వైద్యం అందించారని తెలిపారు. అందర్నీ కలుపుకొని పోయే ఈటెల రాజేందర్ బీసీ వర్గాలకు ఒక దిక్సూచిగా ఉన్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో గణేష్ చారి తో కలిసి పెద్ద ఎత్తున బీసీ సంఘాల నాయకులు బీసీలు భారీగా పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే కృష్ణారావు సతీష్ అరోరా

## ఆశీస్సులు తీసుకున్న బిఆర్ఎస్ శ్రేణులు...

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :



ఉగాది పర్వదినం సందర్భంగా కూకట్పల్లి హ్యాట్రిక్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుని, కో ఆర్డినేటర్ రెడ్డి సతీష్ అరోరాని మర్యాదపూర్వకంగా కలిసి బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వారి ఆశీస్సులు తీసుకున్నారు. కూకట్పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ యూత్ అధ్యక్షుడు పాతూరి గోపి, యూత్ అధ్యక్షుడు జన్ను సాయి శ్రీనివాస్, కె పి హెచ్ బి డివిజన్ ప్రధాన కార్యదర్శి గొర్తి రాజేష్ రాయ్ తదితరులు పాల్గొన్నారు.

### జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో

## అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయి..

ఏ. ఎం.న్యూస్ జూబ్లీహిల్స్:



పని ఏదైనా, సంబంధిత పనికి( డ్రైనేజీ,రోడ్లు, వీధిలైట్లు, శివరేజి, వివిధ రకాల) సంబంధించిన అభివృద్ధి పనులు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి.నవీన్ యాదవ్ ఆదేశాల మేరకు సంబంధిత శాఖలకు సంబంధించిన అధికారులు వారి కిందిస్థాయి సిబ్బందితో, సంబంధిత కాంట్రాక్టర్ల ద్వారా పనులను వేగంగా కొనసాగిస్తున్నారు. అభివృద్ధికి నోచుకోని పనులను సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి.నవీన్ యాదవ్ ఆదేశాలను పాటిస్తూ వేగంగా కొనసాగిస్తున్న పనులను చూస్తున్న బస్తీ (వివిధ బస్తీల)ప్రజలు సంతోష పడుతున్నారు.

## శ్రీ వాసవి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం

ఏ ఎం న్యూస్ ఓయూ:



నాచారం శ్రీ వాసవి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మహంకాళీ దేవలయంలో ఉగాది పర్వదిన వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వేదపండితులు వేదాంతం నర సింహ మూర్తి నేతృత్వంలో అర్చకులు పత్యేక పూజలు చేశారు. ఉగాది పర్వదినం సందర్భంగా దేవాలయ మంటపంలో పరాభవ నామసవత్సరం పంచాంగ పూజ నిర్వహించి భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. నూతన పంచాంగాలను ఆవిష్కరించిన అనంతరం ప్రధాన అర్చకుడు పంచాంగం చదివి వినిపించి భక్తులకు నూతన పంచాంగాలను అందించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మెన్ మెతుకు శ్రీనివాస్ రెడ్డి, శ్రీ వాసవి ఆర్యవైశ్య సంఘం నాచారం అధ్యక్షుడు శ్రీరామ్ సత్యనారాయణ, అధ్యక్షుడు సింగిరికొండ నరసింహ, జనరల్ సెక్రటరీగా బొగ్గారపు రమేష్, కోశాధికారి ఏగిన భాస్కర్, జాయింట్ సెక్రటరీ మహేశ్వర మూర్తి, అడిషనల్ జాయింట్ సెక్రటరీ ఎలిషాల లింగం, ఉపాధ్యక్షులు గౌరీశెట్టి నరేందర్, పుల్లూరి లక్ష్మణ్, సలహాదారులు, సంఘం కార్యవర్గ సభ్యులు, దేవాలయ కమిటీ సభ్యులు కృష్ణా యాదవ్, సునీల్ రెడ్డి, బాలరాజ్ పాల్గొన్నారు.

## రంజాన్ కిట్లను పంపిణీ చేసిన ఫిరోజ్ ఖాన్..


ఏ ఎం న్యూస్, జూబ్లీహిల్స్ :



రంజాన్ మాసం చివరిలో, ఈద్ నమాజ్ కంటే ముందు పేదలకు తప్పనిసరిగా ఇచ్చే దానాన్ని ఫిత్రా (జకాత్ ఆల్ ఫితర్) అంటారు. అటువంటి రంజాన్ మాసం చివరి రోజు వెంకటగిరిలోని జామా మసీదులో ముస్లిం సోదరులకు, సోదరీమణులకు, మైనార్టీ నాయకులకు అందరికీ రంజాన్ కిట్లు మంత్రి అజారుద్దీన్ ఆదేశాల మేరకు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి.నవీన్ యాదవ్ సూచనలతో (రంజాన్ కిట్స్) శుక్రవారం పంపిణీ చేశారు జూబ్లీహిల్స్ నియోజకవర్గం, యూసఫ్ గూడా డివిజన్ మైనారిటీ నాయకులు, కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు (యూసఫ్ గూడా) ఫిరోజ్ ఖాన్. ఈ కార్యక్రమంలో ఫిరోజ్ ఖాన్ వెంట అలీ ఖాన్, సలీం, నగిఖాన్తో పాటు మహిళా అధ్యక్షురాలు సుమన్ ఠాగూర్ పాల్గొన్నారు.

## పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన రాహుల్ దేశ్పాండే

ఏ ఎం న్యూస్, జూబ్లీహిల్స్ :



1964 వ సంవత్సరంలో మార్చి 20వ తారీఖున హనుమకొండ జిల్లా కమలాపూర్ గ్రామంలో ముదిరాజ్ కుటుంబంలో జన్మించారు మాజీ ఎంపీ, ప్రస్తుత భారతీయ జనతా పార్టీ కీలక నాయకులు ఈటల రాజేందర్. వారి పుట్టినరోజు సందర్భంగా అఖిలభారత బ్రాహ్మణ ఆధ్వర్యంలో, ముఖ్య నాయకులతో ఈటల రాజేందర్ ని కలిసి, వారిని ఆశీర్వదించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు రాహుల్ దేశ్ పాండే.

### మాజీ కార్పొరేటర్. నిర్వహించిన

## చివరి రోజు సెహ్రిలో పాల్గొన్న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే..

ఏ ఎం న్యూస్, జూబ్లీహిల్స్ :



సెహ్రి (తెల్లవారుజామున) ప్రార్ధన సమయం కంటే ముందుగా చేసే ప్రక్రియను సేహ్రి అంటారు. సెహ్రి అనేది కేవలం ఆహారం తీసుకోవడమే మాత్రమే కాదు ఇది ఉపవాసానికి సిద్ధమయ్యే ఆధ్యాత్మిక ప్రక్రియ.అటువంటి సెహ్రి కార్యక్రమాన్ని గత కొన్ని ఏళ్లుగా నిర్వహిస్తూ వస్తున్నారు మాజీ కార్పొరేటర్, జిహెచ్ఎంసి మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్. ఈ కార్యక్రమంలో ప్రతిరోజు ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొని, ప్రార్థనలు చేసి బుజిస్తారు. పవిత్ర రంజాన్ మాసం మొదలైనప్పటి నుంచి చివరి రోజు అయిన శుక్రవారం వరకు( 30 రోజులు ) ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశారు. చివరి రోజు ఈ కార్యక్రమానికి జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి.నవీన్ యాదవ్ ని ముఖ్య అతిథిగా ఆహ్వానించారు వారి ఆహ్వానం మేరకు ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి.నవీన్ యాదవ్ పాల్గొని రంజాన్ కిట్లను కార్యక్రమ నిర్వాహకులు అయిన బాబా ఫసి యుద్దీన్ సమక్షంలో మైనారిటీ సోదరులకు, సోదరీమణులకు, కార్యక్రమంలో పాల్గొన్న అందరికీ అందజేశారు. తెల్లవారుజామున మూడున్నర గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి.నవీన్ యాదవ్ పాల్గొనటం అక్కడ ఉన్న వాళ్ళందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గం బోరబండ డివిజన్ కి సంబంధించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకురాలు పాల్గొన్నారు.

## ముసపేట పంచశీల పాఠశాలలో రంజాన్ వేడుకలు

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :




కూకట్పల్లి నియోజకవర్గం పరిధిలోని మూసాపేట పంచశీల స్కూల్లో శుక్రవారం రంజాన్ పండుగ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పంచశీల శ్రీనివాస్ మాట్లా డుతూ సోదర భావంతో రంజాన్ వేడుకలు జరుపుకోవాలని తెలియజేస్తూ రంజాన్ పండుగ ప్రాము ఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇల్లులేక గోడు వెళ్ళబోసుకున్న బుడగజంగాలు

అర్హులైన బుడగ జంగాల కుటుంబాలకు నివాస స్థలాలు అందిస్తా మనీ హామీ ఇచ్చిన టిపిసిసి ఉపాధ్యక్షులు బండి రమేష్

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :



అర్హులైన బుడగ జంగాల కుటుంబాలకు నివాస స్థలాలను ఏర్పాటు చేస్తామని టిపిసిసి ఉపాధ్యక్షుడు కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. ఇటీవల దాకా కైతలాపూర్ 995 సర్వే నెంబర్ లోని ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకొని నివాసముండేవారు. కాగా గత రెండు సంవత్సరాల క్రితం ప్రభుత్వ అధికారులు ఈ స్థలం ప్రభుత్వాన్నిదని తెలియజేస్తూ వారికి ఖాళీ చేయాల్సిందిగా చెప్పడంతో వీరిని ఖాళీ చేయించారు. దీంతో మీరు రోడ్డున పడ్డారు. ఈ విషయమై వారు శుక్రవారం రమేష్ ని ఆయన కూకట్పల్లిలోని శ్రీ హేమ దుర్గా పార్టీ కార్యాలయంలో కలిసి తమ గోడు వెళ్ళబోసుకున్నారు. దీంతో స్పందించిన ఆయన స్థానిక ఎమ్మార్వో స్వామికి ఫోన్ చేసి మాట్లాడారు. వీరి పరిస్థితిపై చర్చించారు. ప్రభుత్వ స్థలం ఎక్కడైనా ఖాళీ ఉంటే వీరికి అక్కడ చూపించవలసిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు లక్ష్మయ్య, గౌట్టిముక్కల వెంకటేశ్వరరావు, శ్రీను ,రాము తదితరులు పాల్గొన్నారు.

### కూకట్పల్లి అల్లాపూర్ గాయత్రీ నగర్లో నిర్మాణం జరుగుతున్న

## ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తా..

### - ముమ్మారెడ్డి ప్రేమ కుమార్..

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :



కూకట్పల్లి నియోజకవర్గంలోని శ్రీ వివేకానంద నగర్ అల్లాపూర్ గాయత్రీ నగర్ డివిజన్లో వెలసి ఉన్న శ్రీ కనకదుర్గ నాగదేవత సహిత పోచమ్మ దేవాలయ కమిటీ చైర్మన్ పులిగోల్ల శ్రీనివాస్ యాదవ్, ప్రెసిడెంట్ కాయితి యాదవ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కల్వల ఏడుకొండలు జనసేన నాయ కులు పవన్ నాయుడు ఆహ్వానం మేరకు జనసేన పార్టీ కూకట్పల్లి ఇన్చార్జ్ ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ హాజరై అమ్మవారి నీ దర్శించుకున్నారు. అనంతరం ఆలయ నిర్మాణంలో భాగంగా ఆలయ ప్రాంగణం లోని ఫ్లోరింగ్ కీ అవసరమైన గ్రానైట్ ఇస్తానాని హామీ ఇచ్చారు. అనంతరం ఆలయ కమిటీ వారు ప్రేమ కుమార్ ని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రేమ కుమార్ మాట్లా డుతూ ప్రజల విశ్వాసమే నా బలం దేవాలయ అభివృద్ధి నా బాధ్యత అని మమ్మారెడ్డి ప్రేమ కుమార్ స్పష్టం చేశారు భక్తుల సహకారంతో ఈ పవిత్ర కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేస్తానని తెలి పారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ఆత్మారి మోహన్, పాదం సూర్య, జయమ్మ శ్రీను, గణేశుల నాగేశ్వరరావు, జెల్లా రవి, సూర్యనారాయణ లలిత మాత గ్రూప్ సభ్యులు,మహిళలు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాల ఏర్పాటు తప్పనిసరి

### - బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :




ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఇలగల సుధీర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మూసాపేట్ జనతా నగర్లోని శ్రీశ్రీశ్రీ చిత్తారమ్మ ఆలయం వద్ద ప్రజల సౌలభ్యం కోసం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు చేతుల మీదుగా ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎండాకాలంలో ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు ముందుకు వచ్చిన యువ నాయకులు ఉప్పల చంద్రశేఖర్ గుప్త, ఇలగల సాయిప్రసాద్ను వడ్డేపల్లి రాజేశ్వరరావు అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎండాకాలంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు ఎంతో ఉపశమనం కలుగుతుందని, ఇది నిజమైన సామాజిక సేవకు నిదర్శనమని పేర్కొన్నారు. యువత ఇలాంటి సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం సమాజానికి ఎంతో మేలు చేస్తుందని అన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా కొనసాగాలని ఆకాంక్షిస్తూ, సమాజంలోని ప్రతి ఒక్కరు ప్రజల అవసరాలను గుర్తించి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు, కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి.నవీన్ యాదవ్

ఏ ఎం న్యూస్, జూబ్లీహిల్స్ :



నెలరోజుల ఉపవాసాల తర్వాత నెలవంక చూడగానే రంజాన్ పండుగను ముస్లిం లు జరుపుకుంటారు. కొత్త బట్టలు ధరించి (నమాజ్) ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. అటువంటి రంజాన్ పండుగ సందర్భంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఎమ్మెల్యే వి.నవీన్ యాదవ్ ముస్లిం సోదరులకు సోదరీమణులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు ( శనివారం(21/3/2026) జరుపుకోబోయే).